క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న నగరపాలక సిబ్బంది

కడప కార్పొరేషన్: కడప నగరంలో ప్లాస్టిక్‌నిషేధం అమలుపై సోమవారం నగరపాలక అధికారులు, సిబ్బంది వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్, పాత బస్టాండు ప్రాంతాల్లో ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పర్యటించి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వ్యాపారులకు వివరించారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానాలు విధిస్తామని వారు హెచ్చరించారు. పర్యావరణ హితమైన కవర్లనే వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నగర శుభ్రతను, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: చలి తీవ్రత పెరగడంతో అనాధ వృద్ధులకు సోమవారం కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా కడప నగరంలో ఆర్టీసీ బస్టాండ్ కూడలి, పాత బస్టాండ్, స్థానిక ఆర్డీఓ కార్యాలయం, రిమ్స్ హాస్పిటల్, రవీంద్ర నగర్, పలు సర్కిళ్లలో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశామని గౌస్‌పీర్ తెలిపారు.

టోల్ వసూళ్లపై దృష్టి పెట్టండి

కడప కల్చరల్ : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటలో టోల్ పేరిట టిక్కెట్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధి జానమద్ది విజయభాస్కర్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గండికోటలో ఆర్థిక అభివృద్ధి కోసం పర్యాటకుల నంచి డబ్బు వసూలు చేయడం పట్ల పలు ప్రజా, విద్యార్థి సంఘాలు నిరసన తెలుపడాన్ని పరిశీలనలోకి తీసుకోవాలని కోరారు. గండికోట అభివృద్ధి కోసం కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా ఈ ప్రైవేటు వసూళ్ల సంగతి పర్యాటక ప్రేమికుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న ఈ ప్రముఖ పర్యాటక ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

వైవీయూకు వెయిట్ లిఫ్టింగ్‌లో పతకం

వైవీయూ: గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పశ్చిమ దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయం పోటీల్లో వైవీయూకు రెండో పతకం లభించింది. వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశంలో నిర్వహించిన పోటీల్లో 81 కేజీల పురుషుల విభాగంలో డి. ప్రేమసాగర్ కాంస్యపతకం సాధించాడు. స్నాచ్ విభాగంలో 134 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ లో 163 కేజీలు, మొత్తం మీద 297 కేజీల బరువెత్తి కాంస్యపతకం సాధించాడు. వైవీయూ పరిధిలోని కమలాపురం సీఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి. ప్రేమసాగర్ పతకం సాధించడం పట్ల సోమవారం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి అభినందించారు.

నేడు నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారానికి వ్యతిరేకంగా మంగళవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడపలో ఈనెల 1వ తేదీ జరిగిన సీపీఎం నగర మహాసభలో 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. సీపీఎం నగర కమిటీ సభ్యులుగా దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసుల రెడ్డి, జమీల, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, కుమారస్వామిరెడ్డి లక్ష్మీ, రాజు, సుబ్బయ్య తో పాటు మరో ఇద్దరిని కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. నగరంలో అనేక సమస్యలు పరిష్కారం కాకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగర కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, కామనూరు శ్రీనివాసుల రెడ్డి, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరి పొలం పరిశీలన

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని చిన్నమాచుపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. అలాగే ఆరబోసిన ధాన్యాన్ని చూసి రైతులతో మాట్లాడారు. రంగుమారడం వల్ల మార్కెట్ ధర తక్కువగా ఉందని రైతులు తెలియజేశారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా ధాన్యం కొనుగోలుకు సిఫారసు చేస్తానని వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కమలి, సునీల్ పాల్గొన్నారు.





బుగ్గవంక.. అధికారులూ ఇటు చూడండిక..

కడప నగరం మధ్యలో ఉన్న బుగ్గ వంక ప్రధాన కాలువను గత ప్రభుత్వం ఆధునికీకరించింది. దీంతోపాటు కాలువకు ఇరువైపులా రోడ్డు నిర్మాణం కూడా చేపట్టారు. అయితే ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావస్తున్నా బుగ్గవంక పనులు అటకెక్కడంతో కాలువ పూర్తి గా గుర్రపు డెక్కతో నిండి పోయింది. ఈ కాలువలోని గడ్డిపొదలు దోమలకు నిలయంగా మారింది . దోమల వ్యాప్తి పెరగడంతో ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. అధికార పార్టీ నేతలు, మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. తక్షణమే పూడిక తీసి, గుర్రపుడెక్కతోపాటు కాలువలోని వ్యర్థాలను తొలగించాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

– మహమ్మద్ రఫీ, ఫొటోగ్రాఫర్, కడప

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామీణ బ్యాంకుల విలీనం తర్వాత కడపలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉంచాలని కోరుతూ మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయం ఎదురుగాగల బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

పీజీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. పీజీ సెట్‌లో అర్హత సాధించినవారు, సాధించని వారు సైతం స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. కళాశాలలో ఎంఏ ఇంగ్లీషు కోర్సు సైతం అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

సెలవులు నిరాకరించడం తగదు



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వైవీయూ: మెగా పేరెంట్స్ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులెవరూ సెలవులు పెట్టుకోవడానికి వీలులేదంటూ డీఈఓ ఆదేశాలు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. సోమవారం కడప నగరంలోని డీఈఓ కార్యాలయంలో పరిపాలనాధికారి పి. మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఆహ్వానిస్తున్నామని, అయితే సమావేశం పూర్తయ్యేవరకు ఉపాధ్యాయులు ఎవరూ పాఠశాలలకు సెలవు పెట్టుకోవడానికి వీల్లేదంటూ సెలవులు నిరాకరిస్తున్నారన్నారు. అనారోగ్యం, అత్యవసర కార్యక్రమాలు, కుటుంబసభ్యులతో ఇబ్బంది పడే ఉపాధ్యాయులు సాధారణ సెలవులు వాడుకోకూడదంటూ ఉత్తర్వులు జారీచేయడం తగదన్నారు. అదే విధంగా పదోతరగతి కార్యాచరణలో సంక్రాంతి సెలవుల్లో కూడా తరగతులు నిర్వహించేలా ఉందని, దీనివలన ఉపాధ్యాయులు పండుగ కూడా జరుపుకునే వీలులేకుండా పోతుందని పేర్కొన్నారు. 100 రోజుల కార్యాచరణపై అధికారులు పున: పరిశీలన చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, యడాల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

జమ్మలమడుగు రూరల్ : నిరుద్యోగ యువతి, యువకులకు కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి విజయవినీల్ కుమార్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేంద్రనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అంబవరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగులకు వెబ్ డెవలప్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం కోర్సులపై శిక్షణ ఇస్తామని వారు పేర్కొన్నారు. వివరాలకు 9000479991, 9398811689కు సంప్రదించాలని వివరించారు.

వేతనాల కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ స్కూలు ఆయాలు, వాచ్‌మెన్‌లకు కూడా ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ కారణాలతో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం బలవంతంగా రాజీనామాలు చేయించిందన్నారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరయ్యనాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చాన్‌బాష, మద్దిలేటి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు కామాక్షమ్మ, మేరి, లక్ష్మీపార్వతి మోహన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు

డీసీసీ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

కడప అగ్రికల్చర్: ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు డీసీసీ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించనున్నట్లు ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేట్ కార్య నిర్వహక అధ్యక్షుడు గంటా నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం డీసీసీ బ్యాంకులో మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు అందిస్తున్న సేవలతోపాటు డిపాజిట్ల సేకరణ కార్యక్రమాన్ని కూడా తలపెట్టడం జరిగిందన్నారు. డీసీసీ బ్యాంకు డిపాజిట్లకు సంబంధించి సీనియర్ సిటిజన్లకు 666 రోజులకు 8.35 శాతం వడ్డీ ఇస్తుందని, సాధారణ ప్రజలకు 7.85 శాతం ఇస్తుందని తెలిపారు. బంగారు ఆభరణాలు, స్థిరాస్తి తాకట్టుపై, గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణాలకు, చిరు వ్యాపారులకు వర్కింగ్ కాపిటల్, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఉన్నత చదువులకు విద్యా రుణాలను కూడా అందిస్తుందన్నారు. 15 సంవత్సరాలలోపు పిల్లలకు పొదుపు, రికరింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెంట్రల్ కమిటీ మెంబర్ వీరబ్రహ్మంతో పాటు బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహించిన ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు

ఏపీజీబీ కేంద్ర కార్యాలయం తరలింపు తగదు

కడప సెవెన్‌రోడ్స్/కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని అమరావతికి తరలించడం తగదని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి అన్నారు. రాయలసీమ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కడప తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కొప్పర్తి ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్‌ను అమరావతికి తరలించారన్నారు. ఇప్పుడు ఏపీజీబీ కేంద్ర కార్యాలయాన్ని కూడా తరలించడం అన్యాయమన్నారు. వెనుకబడిన రాయలసీమలోని సంస్థలన్నింటినీ అమరావతికి తరలించడం వల్ల అక్కడే అభివృద్ధి అంతా పోగు పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి పలు నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్‌బాష తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రవిశంకర్‌రెడ్డి తదితరులు

టాలెంట్ హంట్ ఎంపికలకు స్పందన

కడప స్పోర్ట్స్: వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన టాలెంట్ హంట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. పి.సి.టి.ఆర్. ఫౌండేషన్ చైర్మన్ సి.కె. రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ ఎంపికలను జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓ. రవీంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారు ల్లోని ప్రతిభను గుర్తించి వెలికితీసేందుకు ఈ టాలెంట్ హంట్ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీకృష్ణయాదవ్, కబడ్డీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బ న్న, కోశాధికారి కొండయ్య, అరుణ, రత్నాకర్ రెడ్డి పాల్గొన్నారు.



ఎంపికైన బాలికలు

వసతి గృహాలలో సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ వసతి గృహాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరేలా నిర్ణయాలు తీసుకున్నారు. సోమవారం సాయంత్రం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, వసతి గృహాల చీఫ్ వార్డెన్, వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వార్డన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థినిలకు ప్రత్యేక మెస్ ఏర్పాటు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులకు వేడి నీరు అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైనంతమంది సిబ్బందిని ఏర్పాటు చేసి బాధ్యతలు ఇవ్వనున్నామన్నారు. ఆహార పదార్థాల తయారీకి మిషన్లను కొనుగోలు చేసి వినియోగించనున్నామన్నారు. క్యాంపస్ సీసీ కెమెరాలు పనిచేయని చోట వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. వసతి గృహంలో ఇన్వర్టర్లు అవసరమైన చోట ఏర్పాటు చేయాలని తెలిపారు. స్టీమ్ కుకింగ్ కోసం అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. వార్డెన్లు క్రమం తప్పక వసతిగృహాలను తనిఖీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

స్వామియే శరణం అయ్యప్ప

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీఅయ్యప్ప స్వామి 39వ మండల పూజ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రాంతఃకాలంలో యాగశాల ప్రవేశం ఆచరించి గణపతి పూజ, హోమాలను జరిపించి, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అరటి మోదులతో తయారు చేసిన అంబులంపై శివపార్వతులు, గణపతి, కుమారస్వామి, అయ్యప్ప స్వాములను కొలువు తీర్చి ప్రత్యేక పూజలు జరిపించారు. పడిమెట్ల పాట పాడి భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. స్వామియే శరణం అయ్యప్ప శరణుఘోషతో ఆలయం మారుమోగింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న అయ్యప్పస్వామిని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేల సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వర్షంలోనూ వైభవంగా గ్రామోత్సవం

మండల పూజ అనంతరం సాయంత్రం జోరుగా వర్షం కురుస్తున్నా అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని భక్తులు భక్తిపారవశ్యంతో వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో గురుస్వామి సుబ్బారెడ్డి అయ్యప్ప స్వామికి ఎదురుగా కర్పూర జ్యోతిని పట్టుకుని భక్తులకు హారతి దర్శనం కల్పించారు. ఈ ఉత్సవం వెంట ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీఅయ్యప్పస్వామిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. స్వామివారి వెంట 10 ఏళ్లలోపు బాలికలు జ్యోతులను పట్టారు. భజనలు, కోలాటం, కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.



అంబులంలో కొలువు దీరిన దేవతామూర్తులు



అయ్యప్పస్వామి మండల పూజలో భక్తులు

వైభవం.. ప్రతిష్టా మహోత్సవం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని సగిలేరు ఒడ్డున ఉన్న పరిశుద్ధ పరిపేతురు పరిపాలు చర్చి 137వ ప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి చర్చి ప్రాంగణమంతా భక్తులతో నిండిపోయింది. బ్రిటిష్ హయాంలో నిర్మించిన చర్చి వేడుకలను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. చర్చి లోపల క్రీస్తు శిలువకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జి బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జి కొర్నేలియస్‌ను కలసపాడు వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మేళతాళాలతో చర్చి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. చర్చి డీనరీ చైర్మన్ ఆనందకుమార్, ప్రెస్బేటర్ ఆసిస్‌గాబ్రియేల్ తదితరులు బిషప్‌కు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్చి కమిటీ అన్ని వసతులు కల్పించారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ చిరంజీవి బందోబస్తు నిర్వహించారు.



బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జి కొర్నేలియస్‌ను ఊరేగిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

ఘన సన్మానం



కలెక్టర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న పెద్దదర్గా ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప అమీర్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించుకునేందుకు సహాయ, సహకారాలు అందించిన కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి దర్గా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద దర్గా భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి. చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఎక్సైజ్ అధికారులు ఫస్ట్ ఇయర్ బీటెక్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలు – వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత ఎలా అలవాటు పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ జయరాజు మాట్లాడుతూ కొకైన్, హెరాయిన్ లాంటి డ్రగ్స్‌ను తీసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కృష్ణకుమార్, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి



రహదారి భద్రతపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయానికి ప్రతిరోజు విద్యార్థుల రాకపోకలకు రెండు అదనపు బస్సులు నడపాలని విద్యాలయ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం ఈ మేరకు వారు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తొలుత పేరెంట్స్ అసోసియేషన్ విద్యార్థుల కోసం రూపొందించిన ట్రాఫిక్ నియమ నిబంధనల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, అవగాహన కోసం పేరెంట్స్ అసోసియేషన్ పోస్టర్ తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి కడప కేంద్రీయ విద్యాలయంకు త్వరలో రెండు బస్సులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ జితేంద్ర, కన్వీనర్ చంద్రగిరి నారాయణ, కో కన్వీనర్లు వస్త్రాల నరసింహులు, చింతలపల్లి జయవిశ్వనాథ్, సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాయలసీమ అభివృద్ధిపై దృష్టి సారించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ముఖ్యమంత్రి రాయలసీమ అభివృద్ధిపై దృష్టి సారించాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమరావతికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ సీమను పూర్తిగా విస్మరిస్తోందన్నారు. రాజధానిని అమరావతిగా ముద్రపెట్టే ఏకపక్ష నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టును కర్నూలుకు తరలించాలని, కేవలం బెంచ్‌తో సరిపెట్టకూడదన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీలో వెంటనే అడ్మిషన్లు ప్రారంభించాలన్నారు. రాయలసీమ ప్రాంతానికి కేటాయించిన కొప్పర్తి ఎంఎస్ఎంఈ ఉప కేంద్రాన్ని అమరావతికి తరలించకుండా ఆపాలని, ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రక్రియను నిలిపివేయాలన్నారు. సీమ ప్రాంతంలో సాగు ప్రాజెక్టులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు గ్రామోత్సవం

కమలాపురం : పట్టణంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయం నుంచి గ్రామోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ గురుస్వాములు డాక్టర్ కె.నరసింహశర్మ, నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.